రహదారి చెంత.. పేరుకుపోయిన చెత్త



లింగోజిగూడ: పారిశుద్ధ్యంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో స్థానికులకు ఇబ్బందిగా మారుతోంది. హయత్‌నగర్ నుంచి మునుగనూర్, ఇంజాపూర్ వెళ్లే మార్గాల్లో రోడ్లకు ఇరువైపులా భారీగా చెత్త పేరుకుపోయి అటుగా రాకపోకలు సాగించే క్రమంలో ప్లాస్టిక్ కవర్లు గాలికి ఎగిరి వాహనదారులపై పడుతున్నాయి. కొంతమంది వేరే ప్రాంతాల నుంచి చికెన్ వ్యర్థాలు, చెత్త ఇక్కడ పారబోయడంతో దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించి, ఇతర ప్రాంతాల నుంచి చెత్తను తీసుకొచ్చి ఇక్కడ పారబోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వృథాగా తాగునీరు.. అధికారులు స్పందించరు

మలక్‌పేట: పైపులైన్లతో పాటు మ్యాన్‌హోళ్ల వద్ద వాల్వ్ లీకేజీలతో విలువైన తాగునీరు వృథా అవుతోంది. మూసారంబాగ్ డివిజన్ ఎస్‌బీఐ కాలనీ టీ-జంక్షన్‌లో పైపులైన్ లీకేజీతో తాగునీరు రోడ్డుపై ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథులే లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడే పైపు లీకేజీ కాగా సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేయడంతో సమస్య పునరావృతం అవుతోందని ఉన్నతాధికారులు స్పందించి నీటి లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





ప్రమాదకరం..పట్టించుకోరేం

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్ తేజ్‌నగర్, శాలివాహననగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు ధ్వంసమై ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఇటీవల చేపట్టిన మరమ్మతులో నాణ్యత పాటించకపోవడంతో కొన్ని రోజులకే మళ్లీ కుంగిపోయాయి. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, బాటసారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినా కిందిస్థాయి ఉద్యోగుల్లో ఎలాంటి చలనం లేకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ధ్వంసమైన మ్యాన్‌హోళ్లను మార్చి నూతనంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీ సభ్యులు

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో నెలకున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి ఇతర నియోజకవర్గాలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధి డిఫెన్స్ కాలనీలో రూ. 36 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్మాణదశలో ఉన్న కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని పరిశీలిచారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సుధీర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, కృష్ణమాచారి, రోజారెడ్డి, సదానంద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



జెడ్సీకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంగళవారం బీజేపీ నాయకులు జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం ఇచ్చారు. వనస్థలిపురం రైతుబజారు వద్ద పూలు, పండ్ల దుకాణాలను తొలగించిన చోట రోడ్డంతా గుంతలమయంగా మారడంతో రైతుబజార్‌కు వచ్చేవారు, ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులకు గురవుతున్నారని జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా పలు కాలనీల్లో వీధి దీపాలకు అడ్డుగా చెట్ల కొమ్మలు పెరిగాయని, రాత్రివేళ చీకట్లు కమ్ముకుంటున్నాయని పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, అంజన్‌కుమార్‌గౌడ్, విజయ్‌కుమార్, నర్సింహారావు ఉన్నారు.

పేద ప్రజల జోలికొస్తే ఊరుకోం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి నందనవనం కాలనీలో ఎన్నో ఏళ్లుగా ఉంటున్న పేద ప్రజలను కుట్రపూరితంగా కొంతమంది వచ్చి వారి ఇళ్లను ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని పేద ప్రజల జోలికొస్తే ఊరుకోబోమని భూపేశ్‌గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. మంగళవారం నందనవనం కాలనీలో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. బినామీ పేర్లతో అక్రమంగా నివాసం ఉంటున్న వారి నుంచి అద్దెలు వసూలు చేస్తున్న వారిని వదిలిపెట్టి పేద ప్రజలను వెళ్లగొట్టేందుకు ప్రయత్నాలు చేయడం పద్ధతి కాదన్నారు. నందనవనంలో ఉంటున్న పేద ప్రజలందరూ జేఎన్ఎన్‌యుఆర్ఎం ఇళ్లలో ఉంటున్నారని, చట్టప్రకారం డీడీలు చెల్లించిన వారికి గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ డబుల్ బెడ్రూమ్ ఇస్తామని హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడ్డాక అధికారులు, ప్రజాప్రతినిధులు పేదలను ఆందోళనకు గురి చేస్తున్నారని వెంటనే జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజిత, సైదాబి, శ్వేత, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష తులసి పూజ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీభూ సమేత శ్రీమన్నారాయణ స్వామి ఆదిశేషునిపై దర్శనమిచ్చారు. అనంతరం ఆలయంలో లక్ష తులసి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య గుప్తా పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న కమిటీ సభ్యులు

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ. 23, వంకాయ రూ. 55, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ. 28, కాకర రూ. 32, బీర రూ. 40, క్యాబేజి రూ. 35, ఫ్రెంచి బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 70, దొండ రూ. 28-32, చిక్కుడు రూ. 45-65, గోకర రూ. 50, బీట్‌రూట్ రూ. 55, క్యాప్సికం రూ. 70, ఆలు రూ. 37, దోస రూ. 35, సొర రూ. 15, పొట్ల రూ. 23, ఉల్లిగడ్డ రూ. 45, చామగడ్డ రూ. 37.
ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ మరమ్మతుల కారణంగా చంపాపేట సబ్ స్టేషన్ పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

సుల్తానా అల్వా 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో బాలాజీ, కటకోనికుంట, మహంకాళమ్మతోట, ముస్లింబస్తీ, చంపాపేట పాత బస్తీ, రాజిరెడ్డి, బృందావన్, నేతాజీనగర్ కాలనీలు.

- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు..

చంపాపేట 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయ్‌నగర్, సూర్యానగర్, సామసరస్వతీ, పద్మానగర్, గాయత్రినగర్, మైత్రిపురం, కర్మన్‌ఘాట్ పాత బస్తీ, క్రాంతానగర్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

సిరిపురం కాలనీ, మనోజ్ మాన్షన్ అపార్ట్‌మెంట్స్, సిరిపురం కాలనీ కమ్యూనిటీ హాల్, లాలాజిర్ లైన్, సోయబ్ మెమోరియల్ పార్క్, వాకీ గ్రౌండ్, వాలీబాల్ గ్రౌండ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, గుల్జార్ మజీద్.

- మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

ఎలైట్ రెసిడెన్సీ, అఫ్జల్‌నగర్, వెస్ట్ ప్రశాంత్ నగర్, జాంజాం మిల్క్‌బూత్, చంచల్‌గూడ న్యూరోడ్, డైమండ్ హోటల్, అర్షాద్ హోటల్, వైట్‌హౌజ్, రోషన్‌డైరీ, చంచల్‌గూడ కల్లా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

మూసీ ప్రక్షాళనపై రేపు సెమినార్

నాగోలు: హైడ్రా కార్యకలాపాలు, మూసీ ప్రక్షాళన, పేద, మధ్య తరగతికి ప్రత్యామ్నాయం అనే అంశంపై ఈ నెల 14న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహా ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులు సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ కె. నాగేశ్వర్, ప్రముఖ సంపాదకులు కె. శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొంటారన్నారు.

కార్పొరేటర్ పర్యటన

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ మల్లికార్జుననగర్ కాలనీలో స్థానిక కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి నెంబర్ 4,5,6,7లో సీసీరోడ్డు, పెద్దమ్మ దేవాలయం ప్రహరీ తదితర సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ ఎమ్మెల్యే సహకారంతో నిధుల మంజూరుకు కృషి చేస్తాని హామీ ఇచ్చారు.

పకడ్బందీగా 'సర్వే' నిర్వహించాలి



సర్వే తీరును పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి



కులగణనను పరిశీలిస్తున్న పంకజ

చాదర్‌ఘాట్: సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మలక్‌పేట, చార్మినార్, రాజేంద్రనగర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మలక్‌పేటలో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ప్రతి ఎన్యుమరేటర్ వారికి కేటాయించిన కుటుంబాల్లో సర్వే చేయాలని, పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలన్నారు.

వేగవంతంగా పూర్తి చేయాలి..

ఎల్‌బీనగర్: కులగణనను వేగవంతంగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ హెల్త్ విభాగం అడిషనల్ కమిషనర్, ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల కులగణన నోడల్ అధికారి ఎస్.పంకజ తెలిపారు.హయత్‌నగర్ సర్కిల్ మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని రాగాల ఎన్‌క్లేవ్, సహారా ఎస్టేట్స్‌లో నిర్వహించి కులగణనను మంగళవారం ఆమె పరిశీలించారు.ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య, డిప్యూటి ప్రాజెక్ట్ అధికారి బలరాం, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులతో విజయలక్ష్మి

మలక్‌పేట: జాతీయ స్థాయి కరాటే కుంగ్‌ఫూ పోటీల్లో మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రధానోపాధ్యాయురాలు, హిమాయత్‌నగర్ మండల డిప్యూటీ ఈఓ విజయలక్ష్మి తెలిపారు. సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరులో ఈ నెల 10న నిర్వహించిన కరాటే పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించారన్నారు. బాణమ్మ(8వ తరగతి)కటాస్ విభాగంలో బంగారు, కుమితేలో కాంస్య పతకం సాధించగా బస్వరాజు, శృతిసారిక, పవిత్ర బంగారు, వైష్ణవి, మాధురి రజతం, జ్యోతి కాంస్య పతకాలు సాధించారన్నారు.

గ్రూప్-1,2 అభ్యర్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

నాగోలు: గ్రూప్-1 ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సరూర్‌నగర్ గ్రంథాలయంలో గ్రూప్-1, 2 అభ్యర్థులకు ఆ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ నూతనకంటి వెంకట్ ఉచితంగా పోటీ పరీక్షల పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. టీజీపీఎస్సీ నిర్వహించే గ్రూప్-1, 2, 3 పోటీ పరీక్షలకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని అభ్యర్థులు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు.


సన్మానం

దిల్‌సుఖ్‌నగర్: మహాత్మాగాంధీ లా కాలేజీలో ఉచిత న్యాయ సేవలు అందిస్తున్న చైర్మన్ గంగుల గోవర్ధన్‌రెడ్డిని సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ లా కాలేజీలో అనేక సంవత్సరాల నుంచి ఉచిత న్యాయ సేవలు అందిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ రెడ్డి, గణేష్‌నేత, గోపాల్ రెడ్డి, ఈశ్వర్, గడ్డి అన్నారం మార్కెట్ డైరెక్టర్ మధుసూదన్ రావు, ఖిల్లా మైసమ్మ ఆలయ చైర్మన్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.



'కాడా'అధికారికి పరామర్శ

ఎల్‌బీనగర్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని లగచర్లలో అధికారులపై జరిగిన దాడి ఘటనలో గాయపడిని కొడంగల్ అభివృద్ధి సంస్థ ప్రత్యేక అధికారి ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డిని మంగళవారం రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి పరామర్శించారు. హస్తినాపురం అగ్రికల్చర్ కాలనీలో నివాసముంటున్న వెంకట్‌రెడ్డి ఇంటికి వెళ్లి పలువురు నాయకులతో కలిసి పరామర్శించి జరిగిన ఘటనపై ఆరా తీశారు.



వెంకట్‌రెడ్డిని పరామర్శిస్తున్న సునీతా మహేందర్‌రెడ్డి

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం



మన్సూరాబాద్: కార్తీక మాస ఉత్సవాలు నాగోలు డివిజన్ పరిధి శ్రీదుర్గాదేవి దేవాలయంలో ఘనంగా జరుగుతున్నాయి. దేవాలయ ప్రాంగణంలోని కాశీవిశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఆలయం ఎదుట సామూహిక రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, మురళీ, రమణమూర్తి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీ శ్రీనివాస కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిత్తరంజన్, ఉపాధ్యక్షులుగా సైదులు, అరుణ, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌రెడ్డి, కోశాధికారిగా భూక్యా రామనాయక్, సంయుక్త కార్యదర్శిగా తేజావత్ చరణ్‌సింగ్ నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వేము శేఖర్, లీగల్ అడ్వైజర్‌గా అమర్నాథ్, సభ్యులుగా పెమిరెడ్డి రామపుల్లారెడ్డి, పొట్లూరి రాంబాబు, గుంటుపల్లి వెంకటేశ్వర్లు, గాజుల దేవయ్యలను ఎన్నుకున్నారు. కాలనీ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా చప్పిడి మురళీధర్‌రావు, వైస్ చైర్మన్‌గా సాయి శ్రవణ్ ఎన్నికయ్యారు.

శుభాకాంక్షలు



శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, శివ, భూపాల్ రెడ్డి, సైదులు, రమేష్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీదత్తాత్రేయ యాగం

నాగోలు: వాచస్పతి వేదిక సంస్థాపనమ్ ఆధ్వర్యంలో నేటి నుంచి 17వ తేదీ వరకు నాగోలు శివపురికాలనీ, శైవ మహాపీఠం శ్రీకాశీ విశ్వేశ్వర ఆలయంలో శ్రీదత్తాత్రేయ యాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కేసాప్రగడ రాజశేఖర శర్మ, హరినార నాథవర్మ ఓ ప్రకటనతో తెలిపారు. బుధవారం శ్రీ పంచాయతన పూర్వక పాంచాహ్నిక శ్రీదత్తాత్రేయ యాగం, యాగశాల ప్రదక్షిణ, శాల సంస్కారం, అంకణ, విభజన, అఖండ జ్యోతి ప్రజ్వలన, మహా సంకల్పం, శ్రీమహాగణపతి పూజ, సర్వతోభద్ర మహా మంటపావాహన ఆరాధనలు నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యకి మృతి

లింగోజిగూడ: ఫిట్స్‌తో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..పెద్దఅంబర్‌పేటలోని నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఫిట్స్‌వచ్చి కిందపడినట్లు గుర్తించిన స్థానికులు 108కు ఫోన్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం లాంటిదని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన సాయికుమార్, ఘట్‌కేసర్ బాలాజీనగర్‌కు చెందిన రాజేందర్‌రెడ్డి, గుండ్ల పోచంపల్లికి చెందిన రాజేశ్వరి, బోడుప్పల్ బృందావన్ కాలనీకి చెందిన సమద్, దమ్మాయిగూడ మున్సిపాలిటీకి చెందిన అమూల్య, మూడు చింతలపల్లికి చెందిన మల్లేష్, మృతిచెందిన రాఘవ రెడ్డి సహా ఒక్కొక్కరికి రూ.60 వేల చొప్పున మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి అని, వారి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్తా, 19వ డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ శ్రీనివాస్, నాయకులు పడతం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



ఉప్పల్: విజయవాడలో నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. నవంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు దేశవ్యాప్తంగా వివిధ పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో చాంపియన్లుగా నిలిచారని పాఠశాల యాజమాన్యం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ జోసఫ్ పసల ఆధ్వర్యంలో పూర్తిగా క్రీడల్లో శిక్షణ పొందిన విద్యార్థులు ఇంతటి ఘనత సాధించినట్లు తెలిపారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం, యాజమాన్యం అభినందించింది.